క్లుప్తంగా

'బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం'

కాళేశ్వరం: మహాదేవపూర్ మండలం పంచాయతీరాజ్ శాఖ ఏఈ రవీందర్ కాంట్రాక్టర్లు పనులు చేసిన బిల్లులు చేయకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. 20 మంది కాంట్రాక్టర్లను రెండు సంవత్సరాలుగా పనులు చేసిన బిల్లు ఇవ్వకుండా సదరు కాంట్రాక్టర్లను ఇబ్బందికి గురి చేస్తున్నట్లు ఆరోపించారు. బిల్లులు ఎంబీ రికార్డు చేయకుండా ఇబ్బంది పెడుతున్న ఏఈపై విచారణ జరిపి కాంట్రాక్టర్లకు న్యాయం చేసే వరకు బదిలీపై వెళ్తున్న ఆయనకు రిలీవ్ చేయద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పరామర్శ



మల్హర్: మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన సాయి, రామక్క, సుగుణ, లక్ష్మి ఇటీవల మృతి చెందారు. కాగా బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరావు, యాదగిరిరావు, నారయణ తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన బీఎస్పీ రాష్ట్ర ఈసీ సభ్యుడు సంగి రవి తండ్రి సంగి రత్నం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను చిట్యాల వెలుగు గురుకుల ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు సంజీవయ్య, అమర్, పేరెంట్స్ కమిటీ సభ్యులు కన్నూరి రమేష్, దేవేందర్, సంజీవ్, తదితరులు ఉన్నారు.

నియామకం



పెండెల సంపత్

భూపాలపల్లి రూరల్: బీసీ ఇంటలెక్చువల్ ఫోరం భూపాలపల్లి జయశంకర్ జిల్లా కోఆర్డినేటర్‌గా పెండల సంపత్ పటేల్‌ను నియమించినట్లు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం స్టేట్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. హనుమకొండ హరిత కాకతీయ హోటల్లో శుక్రవారం జరిగిన ఫోరం సదస్సులో సంపత్‌ను నియమించినట్లు తెలిపారు.

బాబోయ్ శునకాలు..

గ్రామాల్లో కుక్కల స్వైరవిహారం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



చిట్యాలలో తిరుగుతున్న కుక్కలు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ, జూకల్, తిర్మపూర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాలలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలను, వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారు. కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడులు చేస్తున్నాయి. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయంతో వణికి పోతున్నారు. నాలుగు నెలల క్రితం చిట్యాల మండల కేంద్రంలోని పలు వీధుల్లో ఒకే శునకం 12 మందిని గాయపర్చింది. మండలంలోని గ్రామాలలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాలపై వెళ్లాలంటే భయమే..

గ్రామాలలో ద్విచక్ర వాహనాలపై ప్రయణించాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. రాత్రి వేళలలో కుక్కలు గుంపులగా ఉంటు వచ్చిపోయో వాహనాల మీదికి పరెగెత్తుకుంటు వస్తున్నాయి. దింతో వాహనాదారులు భయంతో కిందపడిన సంఘటనలు ఉన్నాయి. వీధి కుక్కల బెడదను లేకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని అరికట్టడంలో విఫలం అవుతున్నారని పలువురు విమర్శలు చేస్తున్నారు.

మంచినీళ్ల కోసం వెళ్తుంటే కరించింది



మంచి నీటిని తీసుకరావాడానికి వెళ్తుంటే వెనుక నుంచి కుక్క వచ్చి ఎడమ కాలును కరిచింది. దీంతో చేతిలో ఉన్న క్యాన్‌తో కొట్టడంతో విడిచిపెట్టి వెళ్లింది. హూటన హూటిన స్థానిక సివిల్ ఆస్పత్రికి వెళ్లి టీకా వేసుకున్నాను. అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా చేయాలి.

– సామాల రఘుపతి, చల్లగరిగ

సాగునీటిని విడుదల చేయాలి



చెక్‌డ్యాం వద్ద బీఆర్ఎస్ నాయకులు

చిట్యాల: పంట పొలాలకు సాగు నీటిని వెంటనే విడుదల చేయాలని మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నవాబుపేట గ్రామ శివారులోని చలివాగు, చెక్ డ్యాంను నాయకులతో కలిసి వారు సందర్శించి మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ సహకారంతో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రైతుల సంక్షేమం కోసం చెక్‌డ్యాం మంజూరు చేయగా నిర్మాణ పనులు కుడా పూర్తి అయ్యాయని అన్నారు. చెరువులు, వాగులు మోరంచవాగులు నీరు లేక ఎండిపోవడంతో పంట భూములు బీడుబారి పోయి పంటలు పండక రైతులు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి చలివాగుకు నీటిని విడుదల చేసి చెక్‌డ్యాం నింపి ఈ ప్రాంతాన్ని పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలం చేసేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రవీందర్‌రావు, పెరుమాండ్ల రవీందర్‌గౌడ్, పిట్ట సురేష్, ఆరెపల్లి సమ్మయ్య, సాద రాజు, పప్పు శ్రీనివాస్, నరేష్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఠాకూర్‌నాయి జయంతి వేడుకలు



జయంతి వేడుకల్లో నాయకులు

కాటారం: భారతరత్న కర్పూరి ఠాకూర్‌నాయి జయంతి వేడుకలను మండల కేంద్రంలో శుక్రవారం నాయీబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయీబ్రహ్మణ సంఘం డివిజన్ అధ్యక్షుడు కొయ్యల రాజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయగిరి సమ్మయ్య మాట్లాడుతూ.. బీహార్‌కు చెందిన నాయీబ్రహ్మణుడు ఠాకూర్‌నాయి సామాజిక న్యాయం కోసం జీవితాంతం కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొలిపాక రమేశ్, కొయ్యల రమేశ్, రాజయ్య, పందిళ్ల రాజయ్య, శేఖర్, మల్లేశ్, రవీందర్, రాజు, శ్రీనివాస్, శ్రీకాంత్, మొగిలి, నాగరాజు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మండల ప్రత్యేక అధికారి సునీత



అంగన్‌వాడీ కేంద్రంలో అధికారులు

మొగుళ్లపల్లి: గర్భిణులు, బాలింతలు పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి సునీత అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం మండల ప్రత్యేక అధికారి సునీత యునిఫామ్స్ పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. అర్హులైన వారందరూ అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ హుస్సేన్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రజిత, మాధవి, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం, నిందితులను చూపిస్తున్న పోలీసులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం గుండా 10క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం బొలేరా వాహనంలో తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిరొంచకు చెందిన జనగామ సడువలి, ఎస్డీ వకీల్‌లు పోలీసులు పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు బానిసకావొద్దు

- ఎస్పీ కిరణ్ ఖరే



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి అర్బన్: యువత మత్తు పదార్థాలకు బానిసకావొద్దని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి నిర్వహించనున్న క్రీడా పోటీల వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఏబీవీపీ ప్రాంత కన్వీనర్ వేల్పుల రాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్రీడలు శారీరక మానసిక దారుఢ్యానికి ఉపయోగపడతాయన్నారు. అనంతరం రాజ్ కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 28 తేదీ నుంచి 30 తేదీ వరకు గణపురం, భూపాలపల్లి మండలాల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు జిల్లా కేంద్రంలో నిర్వహించే క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఏబీవీపీ నాయకులు గుజ్జుల ప్రేమ్ కుమార్, రవితేజ, సాంబరాజు, సాయి, రాకేష్, విష్ణువరుణ్ శశి కాంత్, సంతోష్ పాల్గొన్నారు.

రాజ్యాంగ ప్రాముఖ్యతను తెలియపర్చాలి




ఉత్తరాలను ప్రదర్శిస్తున్న నాయకులు

కాటారం: భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను తెలియపర్చేలా జనవరి 26న ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు రాసి పంపినట్లు ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు చిట్యాల శ్రీనివాస్ తెలిపారు. జెండా ఆవిష్కరణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటం, రాజ్యాంగ పుస్తక ప్రదర్శన చేపట్టాలన్నారు. విద్యాసంస్థల్లో ప్రార్థన సమయంలో రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞగా చదివి వినిపించాలని ఉత్తరాల్లో రాసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొరాళ్ల శ్యాం, ఉపాధ్యక్షుడు పంగ మహేశ్, మంథెన రవీందర్, లింగాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ చిత్రపటం ఉంచాలి'

కాళేశ్వరం: గణతంత్ర వేడుకల్లో ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, పాఠశాలల్లో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్‌బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచాలని ఆలిండియా అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు మేరుగు లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెండా ఆవిష్కరణ సమయంలో చిత్రపటం ఉంచాలని కోరారు.

తాటిచెట్లు నరికిన వారిపై చర్య తీసుకోవాలి



నరికిన తాటిచెట్లు

చిట్యాల: తాటి చెట్లను నరికిన వారిపై చర్య తీసుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు పరకాల రవి తెలిపారు. మండలంలోని ఒడితల ప్రభుత్వ పాఠశాల ఆవరణంలోని పది తాటి చెట్లును నరికి వేయాగా ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామానికి చెందిన వ్యక్తులు జంజర్ల రాజ్‌కుమార్, బండి కిరణ్, మ్యాదరి రాజు, మహేశ్వరపు బతుకమ్మ తాటి చెట్లను నరికివేశారని అన్నారు. తమకు జీవనోపాధి తాటి చెట్లు అని ఉపాధి లేకుండా గ్రామానికి చెందిన వ్యక్తులు నరికివేశారని అన్నారు. వారిపై చర్య తీసుకోని తమకు న్యాయం చేయాలని అన్నారు. ఈ మేరకు గౌడ కులస్తులు మాచర్ల రఘు, సట్ల కుమార్, రమణ, సదానందం, రాజు భూపాలపల్లి ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు.

మోడల్‌స్కూల్‌లో ప్యానల్ టీం తనిఖీ



తనిఖీ బృందంతో ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: మండలంలోని కొర్కిశాల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ప్యానల్ టీం సభ్యుల బృందం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధన పరిశీలించి పలు సూచనలు చేశారు. నివేదికను ఏడీకి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి రాకేశ్, తనిఖీ బృంద సభ్యులు జి.కుమార్, ఎస్.దేవకి, కృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గణపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర, పక్కన ఎమ్మెల్యే సాంబశివరావు



రుద్రారంలో పట్టాపాస్ బుక్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం/మొగుళ్లపల్లి: అర్హులైన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం గణపురం మండల కేంద్రంలో నిర్వహిచిన గ్రామ సభలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, గణపురం మండలంఓ చెల్పూరులో, మొగుళ్లపల్లి మండలం పర్లపల్లిలో నిర్వహిచిన గ్రామ సభలో కలెక్టర్ రాహుల్ శర్మతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 26 నుంచి ప్రజా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం, రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి నాలుగు రోజులుగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబితాలో పేర్లు లేనివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హులైన ప్రతి ఒక్కరికి అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అన్నారు. అలాగే కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న కుటుంబాలను సర్వే నిర్వహించడం జరిగిందని, గ్రామసభలలో చదివి వినిపించిన జాబితాలో పేర్లు నమోదు కానీ కుటుంబాల వ్యక్తులు తిరిగి గ్రామ సభలలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద ధరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. గణపురం తహసీల్దార్ సత్యనారయణ స్వామి, ఎంపీడీఓ భాస్కర్, మొగుళ్లపల్లి మండల ప్రత్యేక అధికారి సునీత, తహసీల్దార్ సునీత,ఎంపీడీఓ మహబూబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలు రసాభాసా

కాళేశ్వరం: మహదేవపూర్, పలుగుల గ్రామాల్లో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కోసం నిర్వహించిన గ్రామసభలు రసాభాసాగా మారాయి. శుక్రవారం ప్రభుత్వ పథకాలలో అర్హులైన తమ పేర్లు రాలేదంటూ ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల ఎంపిక ప్రక్రియ నిరంతరం జరుగుతుందని పేరు రానివాళ్లు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పారు. ఆగ్రహించిన ప్రజలు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలని ఇలా దరఖాస్తు చేసుకుంటూ వెళ్తే తమకు పథకాలు ఎప్పుడు వస్తాయని అధికారులను ప్రజలు నిలదీశారు. దీంతో మహదేవపూర్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

రేగొండ: మండలంలోని పెద్దంపల్లిలో గ్రామసభ గురువారం నిర్వహించగా జాబితాలో పేర్లు చదివిన అనంతరం తమ పేర్లు జాబితాలో రాలేదని మాజీ సర్పంచ్ భర్త పసుల రత్నాకర్‌తో పాటు, మరికొందరు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు. సభను సజావుగా జరగడానికి రత్నాకర్‌ను శుక్రవారం ఉదయం అరెస్ట్ చేసి, సమావేశం అనంతరం వదిలేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామంలో మళ్లీ సర్వే నిర్వహించి అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు.

ముగిసిన గ్రామసభలు

మల్హర్: మండలంలోని తాడిచర్ల, రుద్రారం, పెద్ద తూండ్ల, గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. నూతన రేషన్ కార్డులో కోసం లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. రుద్రారం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభను అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీసీఎస్ఓ శ్రీనాథ్‌లు పరిశీలించారు. అర్హులకు నాయ్యం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ ఏఓ శ్రీజ, మాజీ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేశ్ అన్నారు. నాలుగు పథకాల్లో అముల్లో భాగంగా మండలంలోని తాడిచర్ల గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభకు రమేశ్ పాల్గొని మాట్లాడారు. జనవరి 26 నుండి నాలుగు సంక్షేమ పథకాలు అమలవుతాయని పేర్కొన్నారు

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై మండలంలోని బావుసింగ్‌పల్లి, దూత్‌పల్లి, వరికోల్‌పల్లి గ్రామాలలో గ్రామసభలు ఆయా స్పెషల్ ఆఫీసర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. బావుసింగ్‌పల్లిలో అర్హులకు కాకుండా అనర్హుల పేర్లు వచ్చాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిలదీశారు. అనంతరం తహసీల్దార్ హేమ మాట్లాడుతూ.. ఎవరికైనా లిస్టులో పేర్లు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మా పట్టాలు ఎప్పుడు ఇస్తారు?

తమ భూమికి సంబంధించిన పట్టాలు ఎప్పుడు ఇస్తారు సారు.. అంటూ రైతులు మండలంలోని వరికోల్‌పల్లి గ్రామంలో అధికారులను నిలదీశారు. కొన్ని సంవత్సరాల నుంచి రైతులకు సంబంధించిన వ్యవసాయ భూమికి పట్టాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తహసీల్దార్ గ్రామసభకు రావాలని రైతులు డిమాండ్ చేశారు. తమసీల్దార్ వేరే సభలో ఉందని మీ సమస్యను జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్పెషల్ ఆఫీసర్ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



మహదేవపూర్‌లో తమ పేరురాలేదని అధికారులతో వాగ్వాదం చేస్తున్న మహిళ



మల్హర్: మాట్లాడుతున్న రమేశ్



చిట్యాలలో..

దేశ అభివృద్ధే మోదీ లక్ష్యం

మొగుళ్లపల్లి: దేశ అభివృద్ధే మోదీ లక్ష్యమని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు మోరె వేణుగోపాలెరెడ్డి ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నేతత్వంలో కేంద్ర ప్రభుత్వం 26 నవంబర్ 2015న తొలిసారి రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించిందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలోనే రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ భారతరత్న అవార్డు ఇవ్వడం, పార్లమెంటులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరియాదవ్, నాయకులు సారయ్య, రవీందర్, శ్రీనివాస్, కష్టారెడ్డి, రవి, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీఎం సూర్యఘర్ సర్వే

కాటారం: పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన కాటారంలో ట్రాన్స్‌కో అధికారులు నిర్వహిస్తున్న సర్వే శుక్రవారం కొనసాగింది. ట్రాన్స్‌కో సిబ్బంది ఇంటింటా తిరిగి సోలార్ విద్యుత్ ఏర్పాటు కోసం లబ్ధిదారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు సేకరించారు. సర్వేను ట్రాన్స్‌కో భూపాలపల్లి డీఈఈ పాపిరెడ్డి పరిశీలించారు. ప్రతీ ఇంటికి వెళ్లి పీఎం సూర్యఘర్ పథకం గూర్చి వివరించడంతో పాటు సోలార్ విద్యుత్ ఏర్పాటు ఆవశ్యతపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. డీఈఈ వెంట కాటారం ట్రాన్స్‌కో అధికారులు ఉన్నారు.

బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలి



ములుగు రూరల్: ప్రభుత్వం సన్న ధాన్యానికి ప్రకటించిన బోనస్ డబ్బులను రైతుల ఖాతాలలో వెంటనే జమ చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కన్వినర్ అమ్జద్‌పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా సివిల్ సప్లై అధికారి ఫైజల్ హుస్సేన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మకాలు చేపట్టి నెలలు గడుస్తున్న సన్నధాన్యానికి బోనస్ డబ్బులు జమ కాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్, వాంకుడోత్ సమ్మయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

భూపాలపల్లి అర్బన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ ప్రతిభ ఉద్యోగులను గుర్తించినట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి ప్రకటనలో తెలిపారు. ఏరియా స్థాయిలో రాంచెట్టి వెంకటేశ్వర్‌రావు, కంచర్ల కోమురయ్య (కేటీకే–1వ గని), అయ్యగారి శశిధర్, కాపు చంద్రశేఖర్(కేటీకే–5), కాశ వేణు, దాసరి శ్రీనివాస్(కేటీకే–6), కస్తూరి సుదర్శన్, పురుషోత్తమ్‌రావు(కేటీకే ఓసీ–2), మార్గం సురేందర్, గుర్రను మల్లేష్(కేటీకే–8), సీహెచ్ సదయ్య, బానోత్ బాపురావు(కేటీకే ఓసీ–3), ఉత్తమ సింగరేణియన్‌గా నోముల రవీందర్(కేటీకే–6)ను గుర్తించినట్లు తెలిపారు.

'దేవాలయాల ప్రతిష్ట కాపాడటం బాధ్యత'

కాళేశ్వరం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో సింగర్ మధుప్రియ శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పాట చిత్రికరణను ఎలాంటి అనుమతి లేకుండా గర్భగుడిలో చిత్రికరణ చేయడం మన ప్రతిష్టని మనమే హేళన చేసుకోవడం అవుతుందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ శరద్‌చంద్ర పవార్ నేషనల్ యూత్ సెక్రటరీ, యువ భారత్ చైర్మన్ వైద్య ప్రవీణ్ ఒక ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. గతంలో సింగర్ మంగ్లీ శ్రీకాళహస్తీ దేవాలాయలంలో అనుమతి లేని చిత్రీకరణ చేసిందన్నారు. ఇలా చేయడం అనేది హిందువుల మనోభావాలను దెబ్బ తీయడం అవుతుందని పేర్కొన్నారు. హిందువులు మన పుణ్య క్షేత్రాలను మనమే కాపాడుకోవాలని అందరి బాధ్యత అన్నారు. పూజారులు ఇలాంటి సంఘటలనడి మళ్లీ జరగకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ఇలాంటి చిత్రీకరణకు ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడ అనుమతులు ఇవ్వడకూడదన్నారు. కాళేశ్వరం ఈఓపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ విడుదల చేయాలి

భూపాలపల్లి అర్బన్: గత ఏడాది మార్చి నెల నుంచి రిటైర్డ్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీ కమ్యుటేషన్ మొత్తాలను విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంతో పాటు చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర అధ్యక్షుడు చావ రవితో కలిసి సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. గత రెండేళ్లుగా సెలవు జీతాలు, సప్లిమెంటరీ వేతనాలు, మెడికల్ బిల్లులు, జీపీఎఫ్, పెన్షన్, టీఎస్‌జీఎల్ఐ బిల్లులు విడుదల కాకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరేళ్లలో ఆదర్శవంతమైన పనితీరు కనబర్చిన ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమంలో నాయకులు తిరుపతి, కుమారస్వామి, రాణి, వెంకన్న, యుగేందర్, అనిల్, సదయ్య, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410